




మన

# భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

గురువారం 30 జూలై 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 2







## గురువు అంధకారాన్ని పోగొట్టి వెలుగు నింపేవాడు

భానుపురి /సూర్యాపేట టౌన్

గురుపూర్ణిమ సందర్భంగా బుధవారం సూర్యాపేట ఉన్నత యోగ శిక్షణ కేంద్రంలో యోగా గురువు చాడపాపిరెడ్డి తో పాటు ఆయన శిష్యులైన వేల్పుల సుధాకర్, నల్లెడ సుదర్శన్ రెడ్డి, కట్ట మమత లను యోగ సాధకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యోగ గురువు చాడ పాపిరెడ్డి మాట్లాడుతూ వ్యాస మహర్షి జన్మదినమే గురుపూర్ణిమ. దీనిని వ్యాస పూర్ణిమ అని కూడా పిలుస్తారు అని తెలిపారు.వేదాలను నాలుగు భాగాలుగా విభజించి, మహాభారతం రచించి, అష్టాదశ పురాణాలను లోకానికి అందించిన మహర్షి వేదవ్యాసుడి జన్మదినం ఈరోజు అని తెలిపారు. గురువు అంటే అంధకారాన్ని పోగొట్టి వెలుగు నింపేవాడు అని, గ్రంథాలలో కూడా గురువు లేని విద్య వ్యర్థమని చెప్పారు అని అన్నారు. చదువుతోపాటు మంచి-చెడుల గురించి తెలియజేస్తూ, నిస్వార్థంతో విద్యార్థిని ఉన్నత స్థానంలో నిలబెట్టడంలో గురువు పాత్ర కీలకమని చెప్పారు. గురువు లేకపోతే జ్ఞానం లేదు. గురువు లేకపోతే వృద్ధి లేదు అని గురువు, జ్ఞానం రెండూ ఉంటేనే శిష్యుడు అభివృద్ధి చెందుతాడు అని అన్నారు.గురువు లేకుండా జ్ఞానం ఉందని అనుకునే వారికి మహాభారతంలోని ఏకలవ్యుడు మంచి ఉదాహరణ అని తెలిపారు.




ద్రోణాచార్యుడి విగ్రహాన్ని పెట్టుకుని విద్య నేర్చుకున్న ఏకలవ్యుడు, చివరికి గురుదక్షిణగా బొటనవేలు ఇవ్వడంతో అతడు నేర్చుకున్న విద్య వ్యర్థమైంది అన్నారు.గురు వుతో పాటు జ్ఞానాన్ని సరైన పద్ధతిలో ఆచరణలో పెట్టినప్పుడే శిష్యుడు విజయం సాధిస్తాడని, అటువంటి శిష్యుని పొందినప్పుడే గురువుకు మహదానందం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతిరోజు యోగా చేస్తూ ఆరోగ్యంగా, అష్టైశ్వర్యాలతో, ఆనందంగా, ఆప్యాయతతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని సాధకులకు సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో వి. లింగయ్య, ఎన్. వెంకన్న, మల్లారెడ్డి, గోరెంట్ల శ్రీనివాస్, పాల్వాయి పద్మ, కళ్యాణి, రజిత, మంజుల, సుజాత, బాణాల శ్రీనివాస్, శ్రీధర్, మురళీకృష్ణ, బాణాల శ్రీనివాస చారి, కిషోర్, రవికుమార్, సోమన్న, పద్మ, ఉష, సరిత, ఉమ, జ్యోతి, మురళి, శైలజ తదితర సాధకులు పాల్గొన్నారు.






## వినియోగదారుల మన్ననలు పొందాలి



భానుపురి /సూర్యాపేట టౌన్

వినియోగదారుల మన్ననలు పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు. బుధవారం సూర్యపేట జిల్లా కేంద్రంలో 60 ఫీట్ రోడ్డు పాత స్నేహ చికెన్ సెంటర్ బిల్డింగ్ ఎస్ఎస్ వుడెన్ ఫర్నిచర్ షాపును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట పట్టణం వ్యాపార రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని, స్థానికంగా నాణ్యమైన ఉత్పత్తులు అందించే సంస్థలకు ప్రజలు మంచి ఆదరణ కల్పిస్తున్నారని తెలిపారు. ఎస్ఎస్ వుడెన్ ఫర్నిచర్‌లో సొంత తయారీతో ఇంటికి అవసరమైన అన్ని రకాల వుడెన్ ఫర్నిచర్ అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు వెళ్లకుండానే ఆధునిక డిజైన్లలో నాణ్యమైన ఫర్నిచర్‌ను సూర్యాపేటలోనే పొందే అవకాశం కల్పించడం వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కొండపల్లి దిలీప్ రెడ్డి, చినుముల సునీల్ రెడ్డి, జహీర్, స్థానిక కౌన్సిలర్ తాహిర్, నాయకులు అబ్దుల్ రహీం, గుణగంటి సతీష్, తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, ఫరూక్, ఆలేటి మాణిక్యం, దారపునేని శ్రీనివాస్ రావు, వల్లెం శేఖర్, రేపాల శ్రీనివాస్, వెంకట కృష్ణారావు, శ్రీనివాస్ రెడ్డి, నిర్వాహకులు వేమూరి సింధు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

-కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి

భానుపురి/ సూర్యాపేట టౌన్

సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 18వ వార్డు సాయిబాబా మందిరంలో ఇండస్ట్రియల్ ఏరియాలో మాజీ కౌన్సిలర్ మాలోతు కమల చంద్రునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పర్వ దినమని అన్నారు. సాయి బాబా బోధించిన శ్రద్ధ, సబూరి, సేవా భావం ప్రతి ఒక్కరి జీవితానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అన్నదానం మహా దానమని, ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొంది స్తాయని తెలిపారు. సాయిబాబా కృపతో ప్రజ లందరూ సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యా లతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జయ స్కూల్ కరస్పాండెంట్ వేణుగోపాల్, నిమ్మల వెంకన్న, నిఖిల్, రమేష్ నాయుడు, శంకర్ నాయక్, వంశీ, శ్రీను, శకుంతల, తులసి, లక్ష్మమ్మ, మౌనిక, చారి, మన్సూర్ రెడ్డి కళమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఓటు జాబితాలో ఉండేలా చూడాలి

భానుపురి /సూర్యాపేట టౌన్

అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు జాబితాలో కొనసాగేందుకు కృషి చేయాల్సిన బాధ్యత బీఎల్ఓలు, బీఎల్ఏలపై ఉందని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. నిజమైన అర్హులైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా చూడాలని, అవసరమైన పత్రాలతో ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని కోరారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ నాయుడు, కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల మధు గౌడ్, వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్ గౌడ్, మేఘ్య తండా సర్పంచ్ భూక్య రాజు నాయక్, ధర్మ నాయక్, దండ అరవింద్ రెడ్డి, బి ఎల్ వో లు వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ, వెంకటరమణ, రమణ, బిఎల్ఎ లు చేతుల శ్రీనివాస్, భూక్య మహేష్, ఓంకార్ పెంట భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి ఉన్మాద రాజకీయాలను మానుకోవాలి

భానుపురి /సూర్యాపేట టౌన్

పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దాడులు చేయడం అత్యంత నిరసనీయమని, బిజెపి ఉన్మాద రాజకీయాలను మానుకోవాలని సీపీఎం వాణిజ్య భవన్ శాఖ కార్యదర్శి బొమ్మిడి లక్ష్మీ నారాయణ అన్నారు. సూర్యాపేట పట్టణంలోని వాణిజ్య భవన్ వద్ద సీపీఎం వాణిజ్య భవన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాటాడారు. పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసు కోవాల్సిన కేంద్ర ప్రభుత్వం, సమస్యను ప్రశ్నిస్తున్న విద్యార్థులను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంట్ సమావేశాలకు హాజరైన సందర్భంలో కొందరు ప్రజాప్రతినిధులు ఆయనకు దండలు వేసి హారతులు పట్టి స్వాగతం పలకడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడిన ఘటనలకు నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేసి పార్లమెంటుకు వచ్చిన ధర్మేంద్ర ప్రధానుకుస్వాగతాలు పలకడం ప్రజల మనో భావాలను దెబ్బ తీస్తుందని పేర్కొన్నారు. అలాగే అయోధ్య రామమందిర నిర్మాణానికి సంబంధించిన అవినీతి ఆరోపణ లపై సమగ్ర, పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆరో పణలు ఎదుర్కొంటున్న ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిపై వెంట నే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. నటి, ఎంపీ కంగనా రనౌత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను వెంటనే ఉప సంహరించుకోవాలని, ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా బాధ్యతా రహిత వ్యాఖ్యలు చేయడం తగదని అన్నా రు. దేశంలో విద్యా వ్యవస్థను పరిరక్షించడంతో పాటు విద్యా ర్థుల హక్కులను కాపాడాలని, అవినీతి, అక్రమాలకు పాల్ప డిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేష్, త్రివేణి, జగన్, పాచ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## జలి ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలి

భానుపురి /సూర్యాపేట టౌన్




ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుదవారం సూర్యాపేట జిల్లా ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్స్ సమావేశం సూర్యాపేట ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ 106 సంవత్సరాల చరిత్ర కలిగి భారతదేశంలోని ఏకైక పెద్ద కార్మిక సంఘముగా అవతరించిన ఏఐటీయూసీ జిల్లా మూడో మహాసభలను సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆగస్టు 1వ తేదీన నిర్వహిస్తున్నామని ఈ మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందించుకోవడం కోసం దోహదపడతాయని కార్మిక వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన సమరశీల పోరాటాలకు సన్నద్ధం చేయడం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడలను తక్షణమే రద్దు చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ ఢిల్లీలో విద్యార్థులపై జరుగుతున్న దాడిని ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత

భానుపురి /సూర్యాపేట ప్రతినిధి



సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత అగ్రపథాన నిలిపేందుకు ఉపాధ్యాయులు నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో సూర్యాపేట జిల్లా ప్రచేష్టలో మొదటి స్థానాన్ని సాధించడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ బృందాన్ని అభినందించారు.

**ఆ పాత పద్ధతులు వద్దు.. కొత్తగా బోధించండి**

ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను గుర్తించి తరగతి గది బోధన సాగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా.. కృత్యాధార బోధన, ప్రయోగాలు, ప్రాజెక్టులు, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ను ఉపాధ్యాయులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. చదువుతో పాటు విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా పర్యవేక్షించడానికి ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

**తోటలో అన్ని పూలూ వికసించాలి**

ఒక తోటలోని కొన్ని మొక్కలు మాత్రమే పూలిస్తే ఆ తోటకు అందం రాదని అన్ని మొక్కలూ పూలు పూసి వికసిస్తేనే ఆ శోభనిస్తుందని, అలాగే క్లాస్ రూమ్‌లో కేవలం కొందరు విద్యార్థులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ రాణించి ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే విద్యా వ్యవస్థ అసలైన లక్ష్యం నెరవేరుతుందిని కలెక్టర్ ఉదాహరణతో వివరించారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాలు సాధించేలా చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత మెరుగైన స్థానంలో నింపాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈవో కే. అశోక్, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, రేణుక, సెంటర్ ఇంచార్జ్ నాగరాణి, జిల్లా రిసోర్స్ పర్సన్లు శ్రీహరి శ్రవణ్, సత్యనారాయణ రెడ్డి, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

## సంత్ రవిదాస్ మహారాజ్ ఆశయాలు ఆదర్శప్రాయం

భానుపురి /సూర్యాపేట టౌన్



సంత్ రవిదాస్ మహారాజ్ బోధించిన సమానత్వం, సోదరభావం, మానవతా విలువలు సమాజ నిర్మాణానికి మార్గదర్శకాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావు, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ సూచనల మేరకు సంత్ రవిదాస్ మహారాజ్ 650వ జయంతి దీపోత్సవ్ సందర్భంగా బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు బొజ్జ పరశురాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంత్ రవిదాస్ మహారాజ్ సమాజంలో కుల వివక్ష నిర్మూలన, సమానత్వం, మానవ సేవ కోసం కృషి చేశారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమరస సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదలు, దళితులు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. "సబ్‌కా సాథ్ -- సబ్‌కా వికాస్ -- సబ్‌కా విశ్వాస్ -- సబ్‌కా ప్రయాస్" అనే సిద్ధాంతంతో దేశాభివృద్ధి కొనసాగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమరసతా సంకల్ప్ అభియాన్ ద్వారా సందేశాన్ని ప్రతి గ్రామానికి, ప్రతి దళితవాడకు తీసుకెళ్తామని తెలిపారు. సమరసత, ఐక్యత, సేవాభావంతో సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగరాజు రుక్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పణి నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగ చారి, రాష్ట్ర టీచర్ సెల్ కో కన్వీనర్ తికుళ్ళ సాయి రెడ్డి, జిల్లా నాయకులు బూర మల్సూర్ గౌడ్, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు గుణగంటి పృధ్వి, సీనియర్ నాయకులు దాసరి వెంకన్న, జెల్లీ గణేష్, కందుల రమేష్, బోర రమేష్ యాదవ్, గణేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ విశ్వంభరుడు ఆచార్య సినారే

భానుపురి/సూర్యాపేట టౌన్




శ్రీ వాగ్దేవి సాంస్కృతిక కళావేదిక, సూర్యాపేట వారి ఆధ్వర్యంలో బుధవారం జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్, సినీ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి 95వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళావేదిక అధ్యక్షులు, సామాజికవేత్త గుండా రమేష్, ప్రధాన కార్యదర్శి, ఉత్తమ ఉపాధ్యాయులు కల్లూరు నాగయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో సిరిసిల్ల, హనుమాజీపేటలో జన్మించి సహజాతంగా లభించిన సాహిత్య జ్ఞానంతో గేయాలు, కావ్యాలు ఖండికలు, 3500 సినీ గీతాలతో సాహిత్య ఫలాలను సుసంపన్నం చేసిన అనన్య ప్రజ్ఞాశాలి డాక్టర్ సి.నారాయణరెడ్డి అని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గాయకులు, సాహితీ అభిమానులు లు సినారె చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులు తెలిపారు. తదనంతరం డాక్టర్ సినారె రాసిన సినీ గీతాలను గాయకులు ఆలపించి శ్రోతలను అలరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు లింగాల శ్రీనివాస్, ఏ రమేష్, హమీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# చందుపట్లలో వేదవ్యాస భగవానుడి జన్మదినం










భానుపురి/ చందుపట్ల

"వివేక ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం వేదవాస భగవానుడి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వివేక ఫౌండేషన్ చైర్మన్ తికుల్లసాయి రెడ్డి స్వగ్రామం , ఆయన అక్షరాభ్యాసం చేసిన పాఠశాల, ఆరు సంవత్సరాలకు పైగా ఉపాధ్యాయుడుగా పనిచేసిన మద్దిరాల మండలంలోని యుపియస్ చందుపట్ల ఉపాధ్యాయులను ఫౌండేషన్ "ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం తో పాటు విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, చాకోలెట్స్, బిస్కెట్స్ అందచేయడం జరిగింది. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పాల్వాయి కర్ణాకర్, తీకుళ్ళ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్షి కొమ్ము వెంకన్న, వంగూరి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముజీబ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సాయిబాబా దేవాలయంలో పటేల్ రమేష్ రెడ్డి పూజలు



భానుపురి /సూర్యాపేట కల్చరల్

గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయి నగర్ లో గల సాయిబాబా దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని గోశాలను సందర్శించి గోవులకు గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా దేవాలయం కోశాధికారి పోతుగంటి మల్లికార్జున్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్తా, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం పోతుగట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ విభాగ కార్యదర్శి గా సోమ ప్రవీణ్

భానుపురి /సూర్యాపేట టౌన్



తెలంగాణ ఆర్య వైశ్య మహా సభ రాష్ట్ర రాజకీయ విభాగ కార్య దర్శి గా సోమా ప్రవీణ్ కుమార్ ఎన్నికయ్యారు. వీరు సూర్యాపేట జిల్లా,పట్టణ ఆర్యవైశ్య మహాసభ లో వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్నారు. ఇటీవల జరిగిన సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల్లో పోటీచేసిన బెలిదే శ్రీనివాసులు కు తన దైన శైలిలో ప్రచారం నిర్వహించారు. యువ వ్యాపారవేత్త గా ఆధ్యాత్మిక సామాజిక సేవకులు గత కొన్ని ఏండ్లుగా సేవలు అందిస్తున్నారు. వీరి ఎన్నికపట్ల శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం ఒక ప్రకటన లో శుభాకాంక్షలు తెలిపారు.